

## ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన

**హాజరైన అంతర్గం కరణ్ మహారాజ్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే**

**నేటి యువతకు శివాజీ జీవితం ఆదర్శప్రాయం**

**భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయన్న నాయకులు**



**ప్రజానావ, జుక్కల్:** కామారెడ్డి జిల్లా పిట్లం మండలం అల్లాపూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అంతర్గం కరణ్ మహారాజ్, జుక్కల్ మాజీ శాసనసభ్యులు హన్మంత్ షిండే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం శివాజీ మహారాజ్ జీవితం, ఆయన చేసిన ధర్మపోరాటాలు, ప్రజల స్వేచ్ఛ కోసం సాగించిన యుద్ధాల గురించి యువతకు, గ్రామస్తులకు హన్మంత్ షిండే స్ఫూర్తిదాయకంగా వివరించారు. ధర్మం, న్యాయం, స్వాభిమానంతో పాలన చేసిన ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. శివాజీ చూపిన ధైర్యం, నాయకత్వం, ప్రజల పట్ల ఉన్న ప్రేమను ప్రతి ఒక్కరూ జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు. ఇలాంటి మహానుభావుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని హన్మంత్ షిండే అన్నారు. ఈ వేడుకలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మోగా గ్రామ అభివృద్ధికి పాలకవర్గం బాట!

**సర్పంచ్ హాలే బస్వంత్ అధ్యక్షతన జీపీ సాధారణ సమావేశం**

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్చలు**

**వీధిలైట్లు, పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి**



**ప్రజానావ, మద్నూర్:** కామారెడ్డి జిల్లా డోంగ్లి మండలంలోని మోగా గ్రామంలో గురువారం నాడు గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ హాలే బస్వంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామాభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను బట్టి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని పాలకవర్గం నిర్ణయించిందని తెలిపారు. గ్రామంలో వీధిలైట్ల ఏర్పాటు, మురికి కాలువల శుభ్రత, తాగునీటి ఎద్దడి లేకుండా నివారణ చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రధానంగా చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య పనులు మెరుగుపరచడానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శితో పాటు పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు!

**జిల్లాలో 98 శాతం హాజరు నమోదు**

**వెల్లడించిన జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన**

**ప్రజానావ, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర మొదటి పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. రెండో సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 4815 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 4731 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వివిధ కారణాలతో 84 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని వివరించారు. మొత్తంగా 98 శాతం హాజరు నమోదు కావడం విశేషం. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, నిబంధనల ప్రకారం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని కల్పన తన ప్రకటనలో స్పష్టం చేశారు.

# జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి దరఖాస్తు చేసుకోండి!

- కుటుంబ పెద్ద మరణిస్తే 20 వేల రూపాయల ఆర్థిక సాయం
- అర్హులు ఆన్‌లైన్ లేదా ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేయాలి
- వెల్లడించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజానావ, పెద్దపల్లి:** జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో కోరారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్బీఎస్) కింద ప్రయోజనం పొందాలనుకునే వారు పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయాల్లో లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు.

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబాల్లో కుటుంబాన్ని పోషించే ప్రధాన వ్యక్తి 18 నుంచి 60 ఏళ్ల లోపు వయసులో మరణిస్తే.. ఆ కుటుంబానికి ఈ పథకం కింద 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేస్తామని కలెక్టర్ వివరించారు. అయితే, మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఇతర ఏ రకమైన ఆర్థిక సహాయం అందకుండా ఉంటేనే ఈ పథకం వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన పేద కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.





# అక్రమ మత్తు పదార్థాల విక్రేతలపై కొరడా!

- గంజాయి, అక్రమ కల్లు తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్
- 150 గ్రాముల గంజాయి, మూడు క్యాన్ల కల్లు స్వాధీనం

**ప్రజానావ, జుక్కల్:** జిల్లాలో అక్రమంగా మత్తు పదార్థాలు తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం పిట్లం మండలం బోల్లక్పల్లి సమీపంలో జరిపిన తనిఖీల్లో టీవీఎస్ మోపెడ్ పై మూడు క్యాన్ల అక్రమ కల్లును తరలిస్తున్న వాజిద్ నగర్ కు చెందిన సుంకరి సాయిగౌడ్ ను పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే డోంగ్లి గ్రామంలో అంబాలాల్ అర్జున్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారంతో అతని నివాసంపై దాడి చేశామన్నారు. ఈ సోదాలో సుమారు 150 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది నగేష్ తో పాటు పీసీలు పరశురాం, నవీన్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు. అక్రమ మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని సీఐ స్పష్టం చేశారు.

# సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలి

- మెదక్ జిల్లా నూతన కలెక్టర్‌గా ప్రతిమా సింగ్ బాధ్యతల స్వీకరణ
- పూలమొక్కలతో ఘనంగా స్వాగతం పలికిన అదనపు కలెక్టర్, అధికారులు
- పదో తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో ఆరా





**ప్రజానావ, మెదక్:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు పకడ్బందీగా చేరవేయాలని జిల్లా నూతన కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. గురువారం మెదక్ జిల్లా కలెక్టర్‌గా ఆమె అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. నూతన కలెక్టర్ కలెక్టరేట్‌కు చేరుకోగానే జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగ రావు, మెదక్ ఆర్డీవో రమాదేవి పూలమొక్కలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నెరవేరుస్తానని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందేలా తన వంతు కృషి చేస్తానని ఆమె వెల్లడించారు. అనంతరం జిల్లాలో జరగనున్న ఇంటర్, పదో తరగతి పరీక్షల సన్నద్ధత గురించి డీఈవో, ఇంటర్ విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్వో భుజంగరావు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాపై చెరగని ముద్ర.. కలెక్టర్ రాహుల్ రాజ్ బదిలీ!



**ప్రజానావ, మెదక్:** మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ బదిలీ అయ్యారు. గత రెండేళ్ల కాలంలో జిల్లా సమగ్రాభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేసి తనదైన ముద్ర వేశారు. అనేక శాఖల్లో సమూల మార్పులు సంతరించుకునేలా ఆయన పని చేశారు. సమర్థవంతమైన పాలన అందించడంతో అటు ప్రజా ప్రతినిధులు, ఇటు జిల్లా అధికారులు, ప్రజల నుంచి ఆయన విశేష ప్రశంసలు పొందారు. పేద ప్రజలకు విద్య, వైద్యం, సంక్షేమ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా, పకడ్బందీగా అందించడంలో ఆయన సమర్థవంతమైన పాలనను అందించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

కలెక్టర్‌గా మెదక్ జిల్లాలో ఆయన కీలక మార్పులు తీసుకొచ్చారు. 2025 సంవత్సరంలో సుమారుగా 300 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేశారు. విద్యాశాఖలో గ్రౌండ్ బేస్డ్ లెర్నింగ్ విధానాన్ని పటిష్టంగా అమలు చేశారు. ఎస్ఎస్సి ఫలితాల్లో 93 నుంచి 97 శాతానికి ఉత్తీర్ణత పెంచారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్లను ఎంతో ప్రోత్సహించారు. జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది సమయ పాలన పాటిస్తూ విధులు నిర్వర్తించేలా కఠిన చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ.. 2024లో 350 మరణాలు నమోదు కాగా, 2025లో వాటిని 287కు తగ్గించారు. అన్ని సమీక్షలు స్వయంగా నిర్వహించి ప్రమాదాల నివారణకు విశేష కృషి చేశారు. ఈ-ఆఫీసు, ప్లాస్టిక్ నిషేధం, పేపర్ లెస్ లాంటి వినూత్న కార్యక్రమాల అమలుకు శ్రీకారం చుట్టారు. భూ భారతి దరఖాస్తులను పెద్ద ఎత్తున పరిష్కరించారు. దాదాపు పది వేల దరఖాస్తులను శాశ్వతంగా పరిష్కరించి రైతులకు అండగా నిలిచారు. వివిధ విభాగాలకు చెందిన దాదాపు 2,500 పెండింగ్ ఫైళ్లను ఈ-ఆఫీసు ద్వారా పరిష్కరించారు.

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు విద్యా, వైద్యమే ఊపిరి అని, పేద ప్రజలే ఆయన అతిథులని ప్రజలు కొనియాడుతున్నారు. పాఠశాలకెళ్లి విద్యార్థులకు పాఠం చెప్పడం ఆయన నైజం. విద్యార్థుల్లో సైన్స్, గణిత సామర్థ్యాలను పెంపొందించి వారిలోని సృజనాత్మకతను వెలికి తీసిన గురువుగా జిల్లా కలెక్టర్ పేరుగాంచారు. రాత్రి పగలు, సెలవు రోజులు, పండుగ రోజులు అని తేడా లేకుండా ప్రతి రోజు పాఠశాలకు వెళ్లాలనే సంకల్పంతో విద్యార్థులతో నేరుగా మాట్లాడేవారు. వారికి పాఠాలు బోధించి వారి సందేహాలను నివృత్తి చేసిన కలెక్టర్‌గా మంచి పేరుతెచ్చుకున్నారు. వైద్య రంగంలో ఆయనది డిఫరెంట్ స్టైల్. ఒక కవిగా పాటలు రాసి జిల్లా ప్రజల మన్ననలను పొందారు. నేడు తన బదిలీ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ ఈ విషయాలను ప్రత్యేకంగా పంచుకున్నారు.

